# బిల్డర్ నిర్లక్ష్యం.. అధికారుల కక్కుర్తి..

- రోడ్డు లేకుండానే వెంచర్‌కు హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు అనుమతి
- లింక్‌రోడ్డు లేక అరిగోస పడుతున్న త్రిపురల్యాండ్ మార్క్-3 గేటెడ్ వాసులు
- నిర్లక్ష్యం చేసిన అధికారులు, బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



తమ విల్లాలకు వెళ్లే మట్టి రోడ్డులో ఆందోళన చేస్తున్న త్రిపుర ల్యాండ్‌మార్క్-3 విల్లాల నివాసులు

దుండిగల్, సెప్టెంబర్ 12 : బిల్డర్ల కాసుల కక్కుర్తి, అధికారుల అవినీతి పుణ్యమా అని 600 కుటుంబాలు అష్టకష్టాలు పడుతున్నాయి. వెంచర్‌కు సరైన రోడ్డు లేకుండానే ఇచ్చిన అనుమతులతో మూడు కాలనీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని త్రిపుర కన్‌స్ట్రక్షన్స్, ఆర్ఎన్‌జీ సంస్థలు గేటెడ్ కమ్యూనిటీ విల్లాలను నిర్మించాయి. వీటికి మియాపూర్-గండిమైసమ్మ ప్రధాన రహదారి నుంచి కిలో మీటర్ వరకు అప్రోచ్ రోడ్డు ఉన్నట్లుగా హెచ్‌ఎండీఏ అధికారులతో పాటు దుండిగల్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన అనుమతులు ఆయా కాలనీలకు శాపంగా మారిందంటున్నారు స్థానికులు. క్షేత్ర స్థాయి పర్యటనలు జరుపకుండానే కాగితాలపై చూపిన రోడ్డు ఉందో లేదో పరిశీలించకుండానే హెచ్‌ఎండీఏ విల్లాల నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విల్లాలు నిర్మించి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఆయా కాలనీలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందంటున్నారు విల్లాల వాసులు. ఇటీవల ఆర్ఎన్‌జీ కమ్యూనిటీ కాలనీలో గుండెపోటు రావడంతో ఓ వ్యక్తిని ఆసుపత్రికి తరలించేలోపే మరణించారని, ఇక ఓ గర్భిణీ పరిస్థితి వర్ణనాతీతంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు కండ్లుమూసుకుని ఇచ్చిన అనుమతుల కారణంగా జరుగుతుందంటూ ఆరోపించారు. అయితే త్రిపురల్యాండ్ మార్క్-3, ఆర్ఎన్‌జీ గేటెడ్ కమ్యూనిటీలకు రోడ్డు నిర్మించకుండానే హెచ్‌ఎండీఏ క్లియరెన్స్ ఇచ్చి మార్టిగేజ్‌లో ఉన్న విల్లాలను సైతం ఏ విధంగా రిలీజ్ చేసిందని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు ఏర్పాటు కోసం గత నాలుగేండ్లుగా తాము ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ మోక్షం లభించడం లేదన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా సిమెంట్ రోడ్డు నిర్మించాలని బాధితులు కోరుతున్నారు.

**అంతులేకుండా పోతున్న అవినీతి...**

కాసుల కక్కుర్తితో హెచ్‌ఎండీఏ అధికారులు రోడ్డు లేకుండా అనుమతులు ఇవ్వడం, అధికారులకు ముడుపులు ముట్టజెప్పి రోడ్డు లేకుండానే నిర్మించిన విల్లాలను అమ్ముకున్న బిల్డర్లు పలాయనం చిత్తగించడంతో త్రిపుర ల్యాండ్ మార్క్ -3, ఆర్ఎన్‌జీ గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్న వందలాది కుటుంబాలు అరిగోస పడుతున్నాయని ఆరోపించారు. కోట్ల రూపాయలు చెల్లించి విల్లాలను కొనుగోలు చేసిన తాము తమ కాలనీలకు ప్రధాన రహదారికి కలిపే లింక్ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ దారిలో గేటెడ్ కమ్యూనిటీకాలనీ వాసులే కాకుండా ఆర్ఎన్‌జీ అపార్ట్‌మెంట్ వాసులు, పక్కనే ఉన్న శ్రీచైతన్య కాలేజీకి చెందిన వందలాది మంది విద్యార్థులు, అక్కడక్కడ ఇండ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న వారు పయనిస్తున్నారని, గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదన్నారు. త్రిపుర ల్యాండ్ మార్క్-3, బిల్డర్ రోడ్డు వేయకుండా వెళ్తే ఆ రోడ్డు ఎవరు వేయాలనే దానికి ఇటు మున్సిపల్ అధికారులు, అటు హెచ్‌ఎండీఏ అధికారుల నుంచి స్పందన రావడం లేదన్నారు. అధికారుల అవినీతి, బిల్డర్ నిర్లక్ష్యంపై ప్రభుత్వం విచారణ జరుపాలని కోరారు. వెంచర్‌కు అన్ని వసతులు ఉన్నాయని మోసగించి కోట్లాది రూపాయలు దండుకున్న బిల్డర్ పైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు.

## కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి



జగద్గిరిగుట్టలో సీపీఐ నేతల నిరసన

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 12: కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి కేటాయించిన మెడికల్ కాలేజీని ఈ ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. సమస్యపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించాలని కోరుతూ గురువారం జగద్గిరిగుట్టలో నిరసనకు దిగారు. అంతర్జాతీయ సంస్థలకు ఏర్పాటుకు సైతం ఏర్పాటు చేయగలిగే ప్రభుత్వ భూములు ఇక్కడ ఉన్నాయన్నారు. ఉదాసీనంతో గతంలో జగద్గిరిగుట్టలో గురుకుల పాఠశాల తరలిపోయిందన్నారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుపై ఎమ్మెల్యే వివేకానంద్ చొరవ చూపాలని కోరారు. కాలేజీ సాధనకు అన్ని రాజకీయ పక్షాలతో సమావేశమై పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్, హరినాథ్, ప్రవీణ్, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు డ్రాయింగ్ పోటీలు

దుండిగల్, సెప్టెంబర్12: బండారి లేఔట్ సంక్షేమ సంఘం, మధు పెయింట్ ఇన్‌స్టిట్యూట్, స్టోరీ లైన్ టాయ్స్ అండ్ గిఫ్ట్‌షాప్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన బండారి లేఔట్‌లోని రోడ్ నంబర్-3బీలోని కమ్యూనిటీ హాల్‌లో చిన్నారులకు గణనాథుడిపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి ధ్రువీకరణ పత్రంతోపాటు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సైతం అందజేస్తామన్నారు. ఔత్సాహికులు డ్రాయింగ్‌కు కావాల్సిన మెటీరియల్ వాళ్లే తీసుకొని రావాలని, మరిన్ని వివరాలకు సెల్: 9550887192, 89853 62248 సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు



దుండిగల్ మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈఎస్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించగా మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణతోపాటు మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఈఎస్ఐ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతోపాటు సాధారణ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ మేనేజర్ ఎస్.సునంద, ఈఎస్ఐ వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
*- దుండిగల్, సెప్టెంబర్12*

## చేనేత రంగం దేశ విభిన్న రంగాలకు నిదర్శనం



చేనేత రంగం అనేది ఒక పరిశ్రమ మాత్రమే కాదని, మన దేశ విభిన్న సంప్రదాయాలకు నిదర్శనమని డొమెస్టిక్ వయొలెన్స్ కౌన్సెలర్ ప్రేరణ సింహ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2024 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డొమెస్టిక్ వయొలెన్స్ కౌన్సెలర్ ప్రేరణ సింహ విచ్చేసి రాచకొండ కమిషనరేట్, ఉమెన్ సేఫ్టీ వింగ్(షీటీమ్స్), ఇంటర్‌నేషనల్ పొలిటికల్ సైకాలజిస్ట్, డాక్టర్ సుధా జైన్‌తోపాటు నిర్వాహకులు జితేందర్ త్యాగి, సోమనాథ్ భౌమిక్ కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. *- కొండాపూర్, సెప్టెంబర్ 12*

## పీడీఎస్ బియ్యం పట్టివేత


దుండిగల్, సెప్టెంబర్ 12:రేషన్ బియ్యం తరలించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం అందుకుందుకున్న విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించి, వాటిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సూరారం పోలీసులు తెలిపిన ప్రకారం.. సూరారం విలేజ్ సమాపంలోని విశ్వకర్మకాలనీలో నివాసముంటున్న అర్జున్‌పాండే అనే వ్యక్తి తన ఇంటి ముందు రెండు వాహనాల్లో పెద్దమొత్తంలో రేషన్ బియ్యం తరలించేందుకు యత్నిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో విజిలెన్స్ అధికారులు అర్జున్‌పాండే ఇంటిపై తనిఖీలు చేపట్టారు. రెండు వాహనాల్లో 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారుల అధీనంలో పెట్టిన విజిలెన్స్ అధికారులు అర్జున్‌పాండేపై సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు



శ్రీశైలంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో స్వామి వారికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పూజలు చేశారు. గురువారం భ్రమరాంబిక మల్లికార్జున స్వామిని దర్శించుకుని..ప్రజలందరూ చల్లగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, సురేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. *- కేపీహెచ్‌బీ కాలనీ/దుండిగల్, సెప్టెంబర్ 12*

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిద్దేది ఉపాధ్యాయులే



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, యువతను అత్యున్నత శిఖరాలకు చేరవేస్తున్న గురువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ డైరెక్టర్ సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ 16వ వార్డు కమిటీ అధ్యక్షుడు మన్నె శేఖర్, నాయకులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభావతితోపాటు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు. *- దుండిగల్, సెప్టెంబర్ 12*

## డ్రైనేజీ సమస్య పరిష్కరించండి



దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, 9వ వార్డులోని శ్రీనివాస కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక కౌన్సిలర్ బండారి మహేందర్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన పలువురు కాలనీలతో కలిసి దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ సమస్యను పరిశీలించి, పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శ్రీకాంత్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, జీతయ్య యాదవ్, కృష్ణ, శ్రీశైలం, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. *- దుండిగల్, సెప్టెంబర్ 12*

## ముగిసిన మెగా క్రికెట్ టోర్నమెంట్

**ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి**



విజేతగా నిలిచిన బౌరంపేట్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డీసీపీ, ఏసీపీ, సీఐ

దుండిగల్, సెప్టెంబర్ 12: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ పోలీసులు ఆధ్వర్యంలో10 రోజులపాటు నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. కమ్యూనిటీ పోలిసింగ్, ఫ్రెండ్లీ పోలిసింగ్‌లో భాగంగా నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులు, పోలీసులు, జర్నలిస్ట్‌లతో పాటు పలు గ్రామాలు, కాలనీలకు చెందిన యువకులు పాల్గొన్నారు. మొత్తం14 జట్లు పాల్గొనగా, బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ, గండిమైసమ్మ యువకుల జట్లు ఫైనల్లో తలపడగా బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ యువకుల జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలు, కాలనీల ప్రజలు పోలీసులతో స్నేహపూర్వకంగా ఉండేలా ఒకరికొకరు సహకరించుకునేందుకు ఇటువంటి టోర్నీలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ టోర్నీకి సహకారం అందజేసిన కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ పోలీస్‌స్టేషన్ సీఐ సతీశ్, డీఐ సతీశ్, ఎస్ఐలు రామ్మోహన్‌రెడ్డి, శంకర్, బౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సత్యనారాయణ

బాలానగర్,సెప్టెంబర్12: మతాలకు అతీతంగా కలిసికట్టుగా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అడిషనల్ డీసీపీ పి.సత్యనారాయణ అన్నారు. గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని మండపాల నిర్వాహకులతో బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బాలానగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ హనుమంతరావు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు సృష్టించకుండా, సామరస్యంగా జరుపుకోవాలన్నారు. గణేశ్ మండపాలను ఏర్పాటు చేసిన వారు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నిమజ్జనం రోజున తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గణేశ్ నిమజ్జనం వేడుకల్లో డీజే సౌండ్ నిషేధించామని, ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి, ఎస్ఐలు హాజీ మియా, మాకబ్బుల్ పాషా, రాంనారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


## గణపయ్యకు ఘనంగా పూజలు



కేపీహెచ్‌బీ కాలనీ : మొదటి రోడ్డులోని టాకింగ్ బ్రిక్స్, ట్వింకిల్ స్టార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన సినీనటి అర్చన(వేదా), ఫౌండేషన్ చైర్మన్ దుర్గాదేవి, ఎండీ గోపి యాదవ్, భక్తులు



బాలానగర్ : ఓల్డ్‌బోయిన్‌పల్లిలో బొజ్జగణపయ్యను దర్శించుకున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, భక్తులు



కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్‌లో బిగ్ గ్రీన్ గణేశ.. గణనాథుడి పూజలో సినీనటి రెజీనా కసాండ్రా, సంగీత దర్శకులు అనూప్ రూబెన్స్, హాస్యనటుడు రచ్చ రవిలు, భక్తులు



దుండిగల్ : బౌరంపేట్‌లోని వినాయక మండపంలో పూజలు చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, సరుగారి ధర్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



కేపీహెచ్‌బీ కాలనీ:బాలాజీనగర్ డివిజన్ మూస్కిపేటలో శ్రీవినాయక భక్తమండలి ఆధ్వర్యంలో పూజలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, భక్తమండలి సభ్యులు



బాలానగర్ :బాలానగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, భక్తులు



దుండిగల్ : సూరారంలోని కృషికాలనీలో అన్నదానంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వారాల వినోద్‌కుమార్



కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో గణనాథుడి పూజలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ దంపతులు

### కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో

## అక్రమ నిర్మాణాలపై జడ్సీ ఆగ్రహం

**ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం**

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 12: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందిపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. జంట సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు, ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఆరా తీసి.. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గురువారం 'నమస్తే తెలంగాణ దిన పత్రిక'లో.. 'కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో.. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేదెవరు?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి.. మంచి స్పందన లభించింది. దీనికి బాధ్యులైన నోడల్ ఆఫీసర్, ఉప కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్లపై.. వారి పనితీరుపై జడ్సీ మందలించి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్ట రీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను పునాదుల స్థాయిలోనే అరికట్టాలని, చర్యలకు స్పందించకుంటే... నోటీసులు జారీ చేసి.. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్, నోడల్ ఆఫీసర్ రమేశ్.. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్, చైన్‌మన్, న్యాక్ ఇంజినీర్లపై చిందులు వేశారు. తన రిటైర్‌మెంట్‌కు మరో నెల రోజులే ఉందని, అక్రమ నిర్మాణాల వ్యవహారంలో తనకు ఇబ్బందులు కలిగించవద్దని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్లు తెలిసింది. కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, సిబ్బందితో సమావేశం నిర్వహించి.. అక్రమ నిర్మాణాలపై జడ్సీ సార్ సీరియస్‌గా ఉన్నాడని, క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాల వద్ద అమ్యామ్యాలకు అలవాటు పడ్డ ఈ యంత్రాంగమంతా.. జడ్సీ, నోడల్ ఆఫీసర్, డీసీల ఆదేశాలను పాటిస్తారా? లేకా.. ఇలాంటి చీవాట్లు మామూలేనని చేతులు దులుపుకుని.. యథావిధిగా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతారా? అనేది వేచి చూడాల్సిందే.

## రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎమ్మెల్యే గాంధీ



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్, సెప్టెంబర్ 12: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాంధీ విచ్చేసి స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిరంతరం సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయమన్నారు. జన్మదినం సందర్భంగా రక్తదానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొండా విజయ్‌ను అభినందించారు. అనంతరం అనంతరం అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో 100 మంది స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, లక్ష్మారెడ్డి, మహిపాల్ రెడ్డి, కరుణాకర్ గౌడ్, వెంకట్ తదితరులు ఉన్నారు.

## బస్తీలో సమస్యలు పరిష్కరించాలి



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత శంభీపూర్‌కృష్ణ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ/బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణను ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలు/బస్తీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు.
*- దుండిగల్, సెప్టెంబర్ 12*

## ఎరువుల తయారీ కేంద్రంపై ఎస్ఓటీ పోలీసుల దాడి



అనుమతులు లేకుండా తయారు చేసిన ఎరువులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అగ్రిటెక్ అండ్ కెమికల్స్ పేరుతో బయోప్రాడక్ట్ ఎరువులను తయారు చేస్తున్న కేంద్రంపై బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేపట్టారు. తయారీ కేంద్రంలో ఉన్న వివిధ రకాలైన కెమికల్స్, ఇతర ఎరువులు, తయారు యంత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిని జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. ఐడీఏ-జీడిమెట్ల ఫేస్-5 రాంరెడ్డినగర్‌లో ఓ గోదాంలో పిలిగ్రిమ్స్ అగ్రిటెక్ అండ్ కెమికల్స్ సంస్థ నిర్వాహకుడు సాదు సతీశ్‌రెడ్డి(39) గత కొన్నేండ్ల నుంచి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బయోప్రాడక్ట్ ఎరువులను తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. కాగా, దీనిపై కుత్బుల్లాపూర్ మండల వ్యవసాధికారి పరిశీలన చేసిన అనంతరం పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'చెత్త' నిర్వహణ లోపం..

**వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు**



జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులో ఆగిపోయిన చెత్త ఆటోలు

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 12 : తాంబూలమిచ్చాం తన్నుకు చావండి అన్నట్టుంది మున్సిపల్ అధికారుల తీరు. చెత్త సేకరణ, తరలింపు, నిర్వహణ ప్రైవేటుకు అప్పగించాక పర్యవేక్షణ తమది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇందుకు జగద్గిరిగుట్టలోని చెత్త డంపింగ్ యార్డు నిర్వహణే అద్దం పడుతున్నది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలోని చెత్తను పైప్‌లైన్ రోడ్డులోని తాత్కాలిక కేంద్రానికి చేర్చి ఆపై జవహర్‌నగర్‌కు తరలిస్తారు. ఇక్కడ ఆటోల్లో వచ్చిన చెత్తను యంత్రాల్లో కంప్రెస్ చేసి సకాలంలో జవహర్‌నగర్ పంపడంలేదు. వారం రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది చెత్త ఆటోలు రహదారిపై ఆపుతున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైగా చెత్తను రహదారి పక్కనే పోసి ఆపై టిప్పర్లతో తరలిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు సమస్య మరింత తీవ్రమవుతున్నది. అధికారులు, డంపింగ్ యార్డు నిర్వాహకులు పనితీరు మెరుగుపర్చి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.